సాక్షి అనంతపురం

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.21,810

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,810 పలికాయి.



కి'లేడీ'..

రుణాలు ఇప్పిస్తానంటూ పేద మహిళలకు ఓ కి'లేడీ' వల వేసింది. డాక్యుమెంట్లు, సంతకాలు సేకరించి రూ. లక్షల్లో అప్పు తీసుకుని ఉడాయించింది.

8లో

గరిష్టం/కనిష్టం
42.1°/23.6°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేసవితాపం అధికమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 24 నుంచి జూన్ 28 వరకు ప్రతి శనివారం భువనేశ్వర్ (02811) జంక్షన్ నుంచి యశ్వంత్‌పూర్‌కు రైలు బయలుదేరుతుందన్నారు. అదేవిధంగా మే 26 నుంచి జూన్ 30 తేదీ వరకు ప్రతి సోమవారం యశ్వంత్‌పూర్ జంక్షన్ నుంచి బయలుదేరుతుందన్నారు. విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, ధర్మవరం జంక్షన్, శ్రీ సత్యసాయి నిలయం, హిందూపురం రైల్వేస్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

- రేషన్ లబ్ధిదారులకు జేసీ శివ్ నారాయణ్ శర్మ సూచన



అనంతపురం అర్బన్: రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు ఈనెల 30లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించి తగిన ఆదేశాలిచ్చారు. ఈ-కేవైసీతో పారదర్శకత పెరుగుతుందని, నకిలీలను నిరోధించవచ్చన్నారు. జిల్లాలో ఇంకా 1,38,186 మంది ఈ-కేవైసీ చేయించుకోలేదన్నారు. వారి జాబితా రేషన్ షాపు డీలర్, వీఆర్వో, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దారు వద్ద ఉంటుందన్నారు. లబ్ధిదారులు సంబంధిత రేషన్ దుకాణం లేదా వీఆర్ఓ లేదా సచివాలయ సిబ్బంది వద్దకు వెళ్లి ఈ-పాస్ యంత్రంలో లేదా వీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ యాప్‌లో వేలిముద్ర వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలని చెప్పారు.

నేడు 'పది' ఫలితాలు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఉదయం 10 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బంధువుల్లో ఉత్కంఠ నెలకొనగా... రాష్ట్రస్థాయిలో జిల్లా స్థానంపై విద్యాశాఖ అధికారులు కలవరపడుతున్నారు. గత నెల 17న ప్రారంభమైన పది పరీక్షలు ఈనెల 1తో ముగిశాయి. జిల్లాలో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 32,803 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇదే సమయంలో ఓపెన్ (సార్వత్రిక) పరీక్షలు జరిగాయి. రెగ్యులర్‌తో పాటు ఓపెన్ పది ఫలితాలు కూడా విడుదల చేయనున్నారు.

ఫలితాలు ఇలా తెలుసుకోవచ్చు

పదో తరగతి ఫలితాలు https://bse.ap.gov.in, https://apopenschool.ap.gov.in/ వెబ్‌సైట్లు, 'మన మిత్ర' (వాట్సాప్), 'లీప్' మొబైల్ యాప్‌లలో అందుబాటులో ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. అలాగే వాట్సాప్‌లో 95523 00009 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని, రోల్ నంబర్ నమోదు చేస్తే ఫలితాల పీడీఎఫ్ పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, 'లీప్' మొబైల్ యాప్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల లాగిన్‌ల ద్వారా కూడా ఫలితాలు పొందే సౌలభ్యం కల్పించారన్నారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



మాలింగ (ఫైల్)

రాయదుర్గం టౌన్/బ్రహ్మసముద్రం: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువ రైతు మృతి చెందాడు. వివరాలు... బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లికి చెందిన మాలింగ (32) వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం తాను సాగు చేసిన వరి పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లిన ఆయన మోటారు ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గుర్తించిన పక్క పొలంలోని రైతులు వెంటనే రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, మాలింగకు భార్య అంజినమ్మ, ఓ కుమారుడు ఉన్నారు.

నేనింతే.. మారనంతే

ఖాకీ డ్రెస్సు వేసుకుని డ్యూటీ చేయాల్సిన పోలీసులు... టీడీపీ నేతలకు వంగి వంగి సలాములు చేస్తున్న ఘటనలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇప్పటికే రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారుడు శ్రీరామ్‌ల పనిమనిషిలా మారారంటూ విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో 'పచ్చ' చొక్కా తొడుక్కున్న మరో డీఎస్పీ తెరమీదకు వచ్చారు. అత్యంత వివాదాస్పదుడిగా, టీడీపీకి కొమ్ముకాస్తున్న అధికారిగా పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ పేరు తెచ్చుకున్నారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి అండదండలతో పోస్టింగ్ తెచ్చుకున్న విజయకుమార్... టీడీపీ డీఎస్పీగా ముద్ర వేసుకున్నారు. గతంలో ఈయన శింగనమల టీడీపీ టికెట్ కోసం యత్నించడం గమనార్హం.



ఎమ్మెల్యేలు ఆడినట్టే ఆట.. పాడినట్టే పాట

- పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ వ్యవహార శైలిపై సర్వత్రా తీవ్ర చర్చ
- పల్లె రఘునాథరెడ్డి గీత గీస్తే దాటిపోకుండా డ్యూటీ
- గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు
- ఇప్పటికీ తీరు మార్చుకోని వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇప్పటివరకూ పని చేసిన ప్రతి చోటా విజయకుమార్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. గతంలో అనంతపురం ఎస్పీగా అంజనా సిన్హా ఉన్నప్పుడు ఈయన చెన్నేకొత్తపల్లి ఎస్ఐగా పనిచేశారు. ఆ సమయంలో స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఆ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేయగా, పోలీసు ఉన్నతాధికారులు అప్పట్లో కర్నూలుకు బదిలీ చేసి వీఆర్‌లో పెట్టారు. మైదుకూరులో డీఎస్పీగా పనిచేసినప్పుడు కూడా అవినీతి ఆరోపణలు రావడంతో శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేసి వీఆర్‌లో ఉంచారు.

గార్లదిన్నెలో పదెకరాల భూమి!

విజయకుమార్ పోలీసు ఉద్యోగంలో చేరిన తర్వాత అనంతపురం జిల్లాలోని గార్లదిన్నెలో హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారికి దగ్గరగా పదెకరాల భూమి కొన్నట్టు ఇప్పటికీ పోలీసు వర్గాలు కథలు కథలుగా చెప్పుకుంటున్నాయి. ఇంత పెద్ద ఎత్తున భూమి కొనడంపై చాలామంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కరపత్రాల కలకలం

గతంలో అనంతపురంలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డీఎస్పీగా విజయకుమార్ ఉన్న సమయంలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీగా గంగయ్య ఉండేవారు. అప్పట్లో గంగయ్యకు, విజయమార్‌కు మధ్య తీవ్ర స్థాయిలో వివాదాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలోనే గంగయ్యపై కొన్ని కరపత్రాలు బయటకు వచ్చాయి. వీటిని విజయకుమార్ వేయించారనే విమర్శలున్నాయి. ఆ తర్వాత విజయకుమార్ బండారాలన్నీ బయటపెడుతూ బయటకు వచ్చిన కరపత్రాలు కలకలం రేపాయి.

ప్రబోదానంద కేసులో సస్పెండ్..

తనకు నచ్చినవారి కోసం పరిధి దాటి ప్రవర్తిస్తారని విజయకుమార్‌కు పేరుంది. గతంలో జేసీ అనుచరులు ప్రబోదానంద ఆశ్రమంపై దాడి చేసిన సమయంలో విజయకుమార్ ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా ఉండేవారు. అయినా సరే తాడిపత్రి ఇన్‌చార్జ్ డీఎస్పీగా వెళ్లి ఆ కేసును డీల్ చేశారు. ఆ కేసులో తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారులు విజయకుమార్‌ను సస్పెండ్ చేశారు.

మహిళా సీఐపై పరుషంగా..

ప్రస్తుతం పుట్టపర్తి డీఎస్పీగా ఉన్న విజయకుమార్ ఇప్పటికీ తన వివాదాస్పద తీరు మార్చుకోలేదని తెలిసింది. కొన్ని రోజుల క్రితం ఓ మహిళా సీఐపై ఇష్టారాజ్యంగా నోరుపారేసుకున్నారు. దీంతో మహిళా సీఐ తీవ్ర మనస్తాపం చెంది విజయకుమార్‌పై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయితే, మహిళా సీఐకి న్యాయం చేయాల్సిన ఉన్నతాధికారులు.. బాధిత సీఐనే వీఆర్‌కు పంపించడం శ్రీసత్యసాయి జిల్లా పోలీసుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.



ఇటీవల రామగిరి మండలం కుంటిమద్ది సమీపంలో హెలిప్యాడ్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకుంటున్న డీఎస్పీ విజయకుమార్

రామగిరి హెలిప్యాడ్ ఘటనలో ఘోర వైఫల్యం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా ఇటీవల విజయకుమార్‌ను రామగిరి మండలం కుంటిమద్ది సమీపంలో హెలిప్యాడ్ వద్ద సెక్యూరిటీ ఇన్‌చార్జ్‌గా వేశారు. ఒక మాజీ సీఎం వస్తున్న నేపథ్యంలో నిక్కచ్చిగా బందోబస్తు చేపట్టాల్సిన డీఎస్పీ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో హెలికాప్టర్ వద్దకు వేలాదిగా జనం వెళ్లడంతో విండ్‌షీల్డ్ విరిగింది. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తప్పనిసరి పరిసితుల్లో రోడ్డుమార్గంలో బెంగళూరుకు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఖాకీ డ్రెస్సు వేసుకున్న ఈ పోలీసు అధికారి.. ఎమ్మెల్యే అడుగులకు మడుగులొత్తుతుండటం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఎస్కేయూలో సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ కోర్సు ప్రారంభం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సంయుక్తంగా 'సర్టిఫికెట్ కోర్సు ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అండ్ టెస్టింగ్'ను ప్రారంభించాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, ఉద్యోగార్హత, పరిశ్రమల అనుసంధానం పెంచే లక్ష్యంతో ఈ కోర్సును ప్రవేశపెట్టారు. కళాశాల-పరిశ్రమల మధ్య ఉండే అంతరం తగ్గేలా నైపుణ్య ఆధారిత కోర్సును అందించేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ప్రవేశపెట్టిన 'ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్' కోర్సు ద్వారా 400 మందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందిన విషయం తెలిసిందే. తాజాగా రెండో కోర్సు సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అండ్ టెస్టింగ్ కోర్సును మంగళవారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య బి.అనిత చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, అటల్ ఇంక్యుబేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగభూషణరాజు, ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో పోలీసుల విస్తృత తనిఖీలు



అనంతపురం రైల్వే స్టేషన్‌లో జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీస్ బృందం

అనంతపురం సిటీ: స్థానిక రైల్వే స్టేషన్‌లో రైళ్లను ప్రత్యేక పోలీస్ బృందం సహా మూడో పట్టణ పోలీసులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఈ తనిఖీలు కొనసాగాయి. గంజాయి దిగుమతిని అడ్డుకునే క్రమంలో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లన్నీ తనిఖీ చేశారు. ఒడిశాలోని భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు అనంతపురం మీదుగా వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు సంబంధించిన అన్నీ బోగీలను జల్లెడ పట్టారు. అనుమానాస్పద ప్రయాణికులు, వారి లగేజీని జాగిలంతో పరిశీలించారు.

మృగాళ్లున్నారు.. జాగ్రత్త బిడ్డా!

- కణేకల్లు మండలంలోని ఓ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముక్కన్న కన్నేశాడు. వివాహితుడైనప్పటికీ, వావి వరసలు మరచి బాలికను వేధించసాగాడు. ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక తన ఇంటి నుంచి స్కూల్‌కు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో వెంటపడేవాడు. ఈ ఏడాది జనవరి 31న బాలిక స్కూలుకు వెళ్తుండగా వెంబడించాడు. 'నా వెంట రావడానికి నీకెంత కావాలో చెప్పు పడేస్తా' అంటూ నీచంగా మాట్లాడాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని హెచ్చెల్సీ కాలువ వైపు వెళ్లింది. స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వారు చేరుకుని బిడ్డను రక్షించుకున్నారు. జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించిన బాలిక బోరున విలపించింది. ఈ క్రమంలోనే గ్రామస్తులు ముక్కన్నకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.
- పుట్లూరు మండలంలో ఓ గ్రామానికి చెందిన రవితేజ అదే గ్రామానికి చెందిన బాలికను ఇటీవల బలవంతంగా బైక్‌లో ఎక్కించుకుని వెళ్లాడు. ఇంట్లో బాలిక తల్లిదండ్రులు లేని సమయంలో దుశ్చర్యకు పాల్పడ్డాడు. తాడిపత్రి మార్కెట్ యార్డు సమీపంలో నిలిపి ఉన్న ఐచర్ వాహనంలోకి ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు చెబితే చంపుతానని బెదిరించాడు.
- శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ గిరిజన విద్యార్థిని పట్ల కరస్పాండెంట్ లక్ష్మీపతి అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. తన రూమ్‌కు పిలిపించుకుని ఎలా పడితే అలా తాకేవాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఇటీవల పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి.. కీచక కరస్పాండెంట్‌ను అరెస్టు చేశారు.

మైనర్లపై పెరుగుతున్న అకృత్యాలు

- మైనర్లపై పెరుగుతున్న అకృత్యాలు
- గత పది నెలల్లోనే 12 పోక్సో కేసులు
- బయటికెళ్లిన ఆడబిడ్డ ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రుల్లో ఆందోళన

అనంతపురం: ఆడపిల్లలకు భద్రత కరువైంది. బడిలో, బస్సులో ఇలా ఎక్కడ చూసినా పొంచి ఉన్న మృగాళ్లు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బిడ్డ ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పటి నుంచి తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు. ఇక.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్న 'పచ్చ' నేతలు కొందరు తామేమి చేసినా చెల్లుబాటవుతుందనే అహంకారంతో బాలికలు, మహిళలపై కూడా అకృత్యాలకు దిగుతున్నారు. ఇటీవల బొమ్మనహాళ్ మండలంలో ఓ 'పచ్చ' నేత బాలికను మానసికంగా, శారీరకంగా హింసించడమే ఇందుకు నిదర్శనం.

చట్టమున్నా భయమేదీ..?

బాలికలు, చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడితే పోక్సో కేసు నమోదు చేస్తారని తెలిసినా మృగాళ్లు వెనక్కి తగ్గడం లేదు. గత పది నెలల కాలంలోనే 12 పోక్సో కేసులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం. ఇలాంటి కేసుల్లో జీవిత ఖైదు లేదా 7 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్ష పడే పరిస్థితి ఉన్నా లైంగిక దాడుల ఘటనలు చోటుచేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. నేటి 'స్మార్ట్' యుగంలో చిన్న పిల్లలకు సైతం స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉండటం చేటు తెస్తోందని సైకాలజిస్టులు, విద్యావేత్తలు చెబుతున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఏం చేస్తున్నారో వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలంటున్నారు.



జిల్లాలో గత పది నెలల్లో మహిళలకు సంబంధించి నమోదైన కేసుల వివరాలు..

మహిళలపై హింస	18
అత్యాచారం	45
చిన్నారులపై లైంగిక దాడులు	12
వరకట్న వేధింపులు	2
మిస్సింగ్, కిడ్నాపింగ్	06

ప్రభుత్వ సేవలపై ప్రజల్లో అసంతృప్తి





మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్, హాజరైన అధికారులు

- రెవెన్యూ, పౌర సరఫరాల శాఖలపై వ్యతిరేక అభిప్రాయం
- తీరు మార్చుకుని మెరుగైన సేవలందించాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ప్రభుత్వ సేవలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారని, ఐవీఆర్ఎస్(సర్వే)లో అధికారుల పనితీరుపై ఈ మేరకు అభిప్రాయం వెల్లడించారని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, విలేజ్ సర్వేయర్లు, ఇతర సిబ్బందితో ఐవీఆర్ఎస్‌కు సంబంధించి కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ప్రజల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చే విధంగా పనిచేయాలన్నారు. రెవెన్యూ, సర్వే, పౌర సరఫరాల శాఖల అధికారుల పనితీరుపై నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చిందంటూ అసహనం వ్యక్తం చేశారు. తీరు మార్చుకుని ప్రజలు మెచ్చేలా పనిచేయాలని ఆదేశించారు. భూ సమస్యలు, భూ సర్వే నిమిత్తం రైతులకు నోటీసులు జారీ చేస్తున్నారా.. ఈ-సేవకు సంబంధించి నిర్దేశించిన రుసుం కంటే రైతుల నుంచి ఎక్కువ వసూలు చేశారా.. అని ప్రజలకు ఫోన్ చేసి ఆరా తీస్తున్నారన్నారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో 37 మంది, అనంతపురం డివిజన్‌లో 30 మంది, గుంతకల్లు డివిజన్‌లో 14 మంది విలేజ్ సర్వేయర్లపై నెగెటివ్ ఫీడ్ బ్యాక్ అందిందన్నారు. కార్డుదారుల నుంచి అదనంగా డబ్బు వసూలు చేసిన ఎండీయూలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాలకు తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు వెళ్లి విచారణ చేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్, డీఎస్ఓ జగన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన కలెక్టర్

కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించి యూపీఎస్సీ బుధవారం ఢిల్లీలో నిర్వహించనున్న సన్నాహక సమావేశంలో కలెక్టర్ పాల్గొంటారు. తిరిగి ఆయన ఈ నెల 24న విధులకు హాజరవుతారు. దేశవ్యాప్తంగా 77 జిల్లాల నుంచి కలెక్టర్లు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. రాష్ట్రం నుంచి అనంతపురం కలెక్టర్‌తో పాటు మరో మూడు జిల్లాల కలెక్టర్లు పాల్గొననున్నారు.

ఇంకెంత కాలం పస్తులుంచుతారు?

- తాగునీటి పథకం కార్మికుల వేతనాలు తక్షణమే చెల్లించాలి
- ధర్నాలో కార్మిక సంఘాల నేతల డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు, నాయకులు

అనంతపురం అర్బన్: వేతనాలివ్వకుండా ఇంకెన్నాళ్లు శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులను పస్తులుంచుతారంటూ కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. తక్షణమే ప్రత్యేక నిధులు విడుదల చేసి కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించాలంటూ శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు జి.ఓబులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో 600 మంది కార్మికులు వివిధ కాంట్రాక్ట్ ఏజెన్సీల కింద 16 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. వీరికి సంబంధించి నెలల తరబడి పీఎఫ్ బకాయిలు, వేతనాలు చెల్లించకుండా ఏజెన్సీల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పీఎఫ్, వేతనాలు చెల్లించని కాంట్రాక్టు ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం స్పందించి ప్రత్యేక నిధులు కేటాయించడం ద్వారా కార్మికులకు వేతన, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నీటి సరఫరా పథకం కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'సూర్య' ప్రతాపం





అనంతపురంలో మంగళవారం ఎండలో ప్రజల ఇక్కట్లు

అనంతపురం అగ్రికల్చర్: ఎండలు మండిపోతున్నాయి. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా భానుడు భగభగలాడుతున్నాడు. నెల రోజులుగా 38 నుంచి 40 డిగ్రీల మధ్య నమోదైన ఉష్ణోగ్రతలు రెండు రోజుల నుంచి పెరిగాయి. చాలా మండలాల్లో 40 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా పెరగడంతో రాత్రిళ్లు సైతం సెగలు పుడుతున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సూరీడు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత తారస్థాయికి చేరుకుంటోంది. ఈ క్రమంలో జనం బెంబేలెత్తిపోతున్నారు. 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న వడగాల్పులు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. మేలో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరుకోవచ్చని చెబుతున్న నేపథ్యంలో హడలిపోతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

బోరుగడ్డ కేసు 30కి వాయిదా

అనంతపురం: సీఐని దూషించిన కేసులో అనంతపురం మొబైల్ కోర్టు చేపట్టిన విచారణకు బోరుగడ్డ అనిల్ మంగళవారం హాజరయ్యారు. అనంతరం కేసు తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు. రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డ అనిల్‌ను పీటీ వారెంట్ కింద అనంతపురానికి తీసుకు రావడం ఇబ్బందిగా ఉండంతో ఇక్కడి జిల్లా జైల్లోనే ఉంచేలా నిర్ణయం తీసుకున్నారు.


పాత్రికేయుడి ఇంటిపై గాజు సీసాలతో దాడి

యాడికి: ఓ పత్రికకు (సాక్షి కాదు) తాడిపత్రి ఇన్‌చార్జ్ పాత్రికేయుడు పనిచేస్తున్న యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన ఈడిగ రామకృష్ణ గౌడ్ ఇంటిపై మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు గాజు సీసాలతో దాడి చేశారు. రామకృష్ణ, శారద దంపతుల ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. సోమవారం రాత్రి దంపతులిద్దరూ ఇంటి పై భాగంలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి నలుగురు వ్యక్తులు ముఖాలకు ముసుగులు ఖాళీ గాజు బీరు సీసాలను ఇంటి పైకి విసిరి, ద్విచక్ర వాహనాల్లో ఉడాయించారు. రామకృష్ణ సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడేళ్ల బాలికపై అత్యాచారయత్నం

పుట్లూరు: మండలంలోని ఓ గ్రామంలో మూడేళ్ల బాలికపై 50 ఏళ్ల వయసున్న ప్రసాద్ మంగళవారం అత్యాచారయత్నం చేశాడు. బాలిక ఆడుకుంటుండగా చుట్టూ ఎవరూ లేని సమయంలో అత్యాచారయత్నం చేయబోగా బాలిక గట్టిగా కేకలు పెట్టింది. దీంతో తల్లిదండ్రులు అక్కడకు చేరుకుంటుండగా ప్రసాద్ పారిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నిండా ముంచిన కిలేడీ!



- రుణాలు ఇప్పిస్తానంటూ నిరుపేద మహిళలకు వల
- అవసరమైన డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకొని వారికి తెలియకుండా రూ.లక్షల్లో రుణాలు
- విషయం బయటపడడంతో ఉడాయింపు
- రూ.50 లక్షలకు పైగా కుచ్చుటోపీ

గుంతకల్లు రూరల్: జీవనోపాధుల మెరుగుకు అవసరమైన రుణాలు ఇప్పిస్తానంటూ నిరుపేద మహిళలను వంచనకు గురి చేసి రూ.50 లక్షలకు పైగా కుచ్చుటోపీ పెట్టిన కిలాడీ లేడీ ఉదంతం వెలుగు చూసింది. బాధిత మహిళలు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం జి.కొట్టాల గ్రామానికి చెందిన రాధమ్మ భర్తతో విడాకులు పొందిన తర్వాత స్వగ్రామానికి చేరుకుని బీసీ కాలనీలో తన తల్లి, కుమారుడితో కలసి నివాసముంటోంది. ఈ క్రమంలో తన బతుకు తెరువు కోసం చీరలు, గాజుల వ్యాపారంతో పాటు అనధికారికంగా చిట్టీల నిర్వహణనూ చేపట్టింది. ఈ క్రమంలో ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ వారితోనూ పరిచయాలు పెంచుకున్న ఆమె గ్రామంలో మహిళలకు రుణాలు ఇప్పిస్తానంటూ నమ్మించి రూ.50 లక్షలకు పైగా దగా చేసింది. గ్రామంలో పది ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి పంటను సాగు చేసి లాభాలను గడించిన ఆమెను నమ్మిన కొందరు పెద్ద మనుషులు సైతం రూ.30 లక్షల వరకూ అప్పులు ఇచ్చినట్లు సమాచారం.

నగదు సాయం చేస్తూనే...

ఇరుగు పొరుగు మహిళల్లో అమాయకులు, నిరుపేదలైన వారిని గుర్తించిన రాధమ్మ... వారికి చీరలు, గాజులు అప్పుగా ఇవ్వడంతో పాటు అవసరానికి కొంత మేర నగదు సాయం చేస్తూ వచ్చింది. అనంతరం వారి ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని తనకు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు చాలా తెలుసునని, అవసరమైతే ఇంటి వద్దనే రుణాలను ఇప్పిస్తానని నమ్మబలికింది. ఆమె మాయలో చిక్కుకున్న కొందరికి మొదట్లో రుణాలను ఇప్పించింది. అప్పు తీసుకోవడానికి భయపడిన వారికి నచ్చచెప్పి ఆ రుణం తాను తీసుకొని తానే కంతులు చెల్లిస్తానంటూ నమ్మబలికి రుణాలు తీసుకుంది. ఇందుకు గాను వారికి కొద్ది మేర కమీషన్ రూపంలో చెల్లిస్తూ వచ్చింది. చేసిన అప్పులు క్రమంగా పెరిగిపోవడం, కుమారుడు కూడా వ్యసనాలకు బానిసగా మారడంతో రుణం కోసం వచ్చిన కొందరు మహిళలతో అవసరమైన డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకుని మంజూరైన రుణాలను తన అవసరాలకు వాడుకోవడం మొదలు పెట్టింది. ఇలా టాటా క్యాపిటల్, స్పందన, గ్రామీణ కూటమి, కీర్తన గోల్డ్, బజాజ్ ఫైనాన్స్ వంటి పలు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల ద్వారా గ్రామంలోని దాదాపు 25 నుంచి 30 మంది మహిళల పేరున రూ. 50 లక్షల వరకూ రుణాలను తీసుకున్న ఆమె... ఆ తర్వాత రుణం కంతులు చెల్లించలేకపోవడంతో ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు రుణం పొందిన వారిని వేధించడం మొదలుపెట్టారు. దీంతో బాధితులు నేరుగా వెళ్లి రాధమ్మను నిలదీయడంతో పరిస్థితి చెయ్యి దాటిపోతోందని గుర్తించిన ఆమె రెండు నెలల క్రితం తన తల్లి, కుమారుడితో కలసి గ్రామం విడిచి వెళ్లిపోయింది.

రూ.లక్షలు కట్టమంటున్నారు



నా భర్త బాలకృష్ణతో కలసి నేను వ్యవసాయ కూలి పనులకు వెళుతూ ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటున్నాం. ఓ రోజు రాధమ్మ మాటలు నమ్మి నా భర్తకు తెలియకుండా బ్యాంకు బుక్, ఆధార్, ఏటీఎం కార్డు తీసుకెళ్లి ఇచ్చాను. తర్వాత ఫైనాన్స్ కంపెనీ వారు వచ్చారంటూ కబురు పెట్టడంతో వెళ్లి వారిచ్చిన కాగితాలపై సంతకాలు చేసి, ఫొటో దిగి వచ్చాను. అయితే రుణం డబ్బు మాత్రం చేతికి అందలేదు. అడిగితే రిజెక్ట్ అయిందని చెప్పింది. రాధమ్మ ఊరు విడిచి వెళ్లిపోయిన తర్వాత ఫైనాన్స్ కంపెనీ వారు వచ్చి నా పేరుపై రూ.1.25 లక్షల రుణం ఉందని, డబ్బు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఆ డబ్బు ఎలా కట్టాలో దిక్కుతోచడం లేదు.

– భవాని, జి.కొట్టాల, గుంతకల్లు మండలం

రూ.1.75 లక్షలు కట్టాలంటా



గ్రామంలో మాకు సెంటు భూమి కూడా లేదు. ఉపాధి పనులే దిక్కు. రుణం ఇప్పిస్తానని నమ్మబలికిన రాధమ్మ.. నా పేరున స్పందన కంపెనీలో రూ.88 వేలు, గ్రామీణ కూటమి కంపెనీలో రూ.55 వేలు, అదేదో కంపెనీ అంటూ దానిలో కూడా రూ.40 వేలు రుణం తీసుకుంది. ఆమె ఊరు విడిచి వెళ్లడంతో ఇప్పుడు ఆ అప్పులన్నీ నా నెత్తిన పడ్డాయి. డబ్బు కట్టమంటూ ఫైనాన్స్ కంపెనీ వాళ్లు వచ్చి పరువు తీస్తున్నారు.

– కనుంపల్లి దుర్గమ్మ , జి.కొట్టాల

బాధితులకు న్యాయం చేయాలి



జి.కొట్టాల గ్రామంలో నిరక్షరాస్యులు, అమాయకులైన మహిళలను ఏమార్చి వారి పేర్లపై రూ.లక్షల్లో రుణాలను పొంది మాయమైన రాధమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అమాయకులను వేధించడం ఫైనాన్స్ కంపెనీ వారికి తగదు. దీనిపై పోలీసులు చొరవ తీసుకొని రాధమ్మను అదుపులోకి తీసుకొని బాధితులకు న్యాయం చేయాలి.

– రాము, సీపీఐ మండల కార్యదర్శి

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జిల్లా జడ్జి భీమారావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ఉమ్మడి జిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తి భీమారావును ఎస్పీ పి.జగదీష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులోని చాంబర్‌లో జడ్జికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్ల అరెస్ట్

బొమ్మనహాళ్: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. ఉద్దేహాళ్‌లో మంగళవారం బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకులు చికెన్ కబాబ్ సెంటర్ వన్నూరుస్వామి, చిన్నా, ఇమ్రాన్, మహేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.30 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటిపై పెట్రోల్‌తో దాడి

తాడిపత్రి టౌన్: స్థానిక శ్రీనివాసపురంలో నివాసముంటున్న బేల్దారి మల్లికార్జున ఇంటిపై మంగళవారం అదే కాలనీకి చెందిన చాకలి రాముడు బంధువు భరత్, మరో వ్యక్తి పెట్రోల్‌తో దాడి చేసారు. రెండు నెలల క్రితం స్థానిక జేసీ పార్కు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో చాకలి రాముడు మృతి చెందిన విషయం తెలిసిందే. తన బంధువు మరణానికి కారణం మల్లికార్జుననే కక్షతో భరత్ ఈ ఘాతుకానికి తెగబడ్డాడు. దీంతో ఇంట్లో విలువైన సామగ్రి కాలిపోయింది. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

బీపీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీపీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య బి.అనిత మంగళవారం విడుదల చేశారు. మొత్తం 33 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 29 మంది ఉత్తీర్ణులయ్యారు.

జాతీయ స్థాయి పోటీలకు బీకేఎస్ విద్యార్థి



ఎంపికైన విద్యార్థితో పీడీ గోపాల్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: ఈ నెల 22 నుంచి 27 వరకూ న్యూఢిల్లీలో జరిగే ఎస్జీఎఫ్ అండర్-17 బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించి ఏపీ బేస్‌బాల్ జట్టులో స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థి మోహన్ చోటు దక్కించుకున్నాడు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఈ సందర్భంగా విద్యార్థిని ఆ పాఠశాల హెచ్‌ఎం వసుంధర, పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ ఆకాంక్షించారు.

యువతి బలవన్మరణం



మృతురాలు సంగీత స్వరాజ్

గుంతకల్లు రూరల్: ఉద్యోగాన్వేషణలో విసిగి ఓ ఇంజినీరింగ్ పట్టభద్రురాలు ఆత్మహత్య చేసుకుంది. వివరాలు... గుంతకల్లులోని మంజునాథ్ కాలనీలో నివాసముంటున్న దాసరి గోపాల్‌కు ముగ్గురు కుమార్తెలు సంతానం కాగా, వీరిలో మూడో కుమార్తె సంగీత స్వరాజ్ (25) ఎంటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అవకాశాలు ఏవీ రాకపోవడంతో తాను సాఫ్ట్‌వేర్ వైపు వెళ్తానని సోమవారం రాత్రి తల్లిదండ్రులకు తెలిపారు. అయితే ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నం చేయాలని, ఆ తర్వాతనే సాఫ్ట్‌వేర్ జాబ్ గురించి ఆలోచిద్దామంటూ కుటుంబ పెద్దలు తెలపడంతో అప్పటికి ఆమె అంగీకరించింది. మంగళవారం తెల్లవారు జామున 6 గంటల సమయంలో బాత్రూమ్‌కు వెళ్లిన సంగీత స్వరాజ్ ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు తలుపు తట్టి పిలిచారు. లోపలి నుంచి స్పందన లేకపోవడంతో బలవంతంగా తలుపు తెరిచి పరిశీలించారు. వెంటిలేటర్‌కు ప్లాస్టిక్ తాడుతో వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు జూనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం 1వ అదనపు సివిల్ జడ్జి ఈ.ప్రతిభను కడప ప్రిన్సిపల్ సివిల్‌జడ్జిగా బదిలీ చేశారు. అలాగే అనంతపురం మొబైల్ మేజిస్ట్రేట్ జె.సుజిన్‌కుమార్ ను గుంటూరు జిల్లా సత్తెనపల్లి రెండో అదనపు సివిల్ జడ్జిగా, ధర్మవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కె.రమ్యసాయిని చిత్తూరు జిల్లా పుత్తూరు అదనపు సివిల్ జడ్జిగా, హిందూపురం నుంచి ఎస్. రాజ్యలక్ష్మిని పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు, కదిరి నుంచి ఎస్.ప్రతిమను కర్నూలు జిల్లా బనగానపల్లికి, కళ్యాణదుర్గం నుంచి బి. సుబహాన్‌ను మదనపల్లికి, పెనుకొండ నుంచి ముజీబ్ పసపాలను పుట్టపర్తికి, పుట్టపర్తి నుంచి కె.రాకేష్‌ను పెనుకొండకు, కడప నుంచి జె.నందినిని ధర్మవరానికి, ప్రొద్దుటూరు నుంచి ఆర్.హారికను అనంతపురానికి, ఎం.అనిల్‌కుమార్‌ను తాడిపత్రికి, తాడిపత్రి నుంచి టి.కృష్ణవేణిని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు కోర్టుకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారందరూ మే 2వ తేదీలోపు రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా

- వేర్వేరు ప్రాంతాల్లో నీట మునిగి ఇద్దరు బాలుర మృతి



మృతులు అభిరాం ప్రణీత్

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంటకు చెందిన వెంకటేశులు, గంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో జె.వెంకటంపల్లి సమీపంలో బీటీపీ ప్రధాన సాగునీటి కాలువలో మంగళవారం ఉదయం దుస్తులు ఉతికేందుకు తల్లి గంగమ్మతో పాటు కుమారుడు అభిరాం (8) వెళ్లాడు. కాలువ నీటిలో సరదాగా ఈత కొడుతున్న అభిరాం కాసేపటి తర్వాత నీటి మునిగాడు. గమనించిన గంగమ్మ గట్టిగా కేకలు వేయడంతో అక్కడికి సమీపంలో ఉన్నవ ఉన్నవారు వెంటనే కాలువలో దిగి బాలుడిని వెలికి తీశారు. అపస్మారక స్థితికి చేరుకున్న బాలుడిని చికిత్స నిమిత్తం రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి.. బాధిత తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుంతకల్లు రూరల్: మండలంలోని మైనాపురం గ్రామానికి చెందిన ఆదినారాయణ, ప్రభావతి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి దగ్గర్లో ఉన్న పొలంలోని ఫారంపాండ్‌లోకి వర్షపు నీరు చేరింది. దీంతో మంగళవారం ఈతకెళదామంటూ చిన్న కుమారుడు ప్రణీత్ (8) పట్టుబట్టాడు. దీంతో ప్రణీత్‌ను పిలుచుకుని నానమ్మ ఈరమ్మ ఫారంపాండ్ వద్దకు బయలుదేరింది. అయితే కాస్త దూరంగా ఉండగానే నానమ్మను వదిలి పరుగున వెళ్లిన ప్రణీత్.. ఫారంపాండ్‌లో దూకాడు. ఆ సమయంలో ఈరమ్మ గట్టిగా కేకలు వేయడంతో ఆ పక్కనే ఉన్న గొర్రెల కాపరులు అప్రమత్తమై నీటితో దూకి బాలుడిని వెలికి తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న ప్రణీత్‌ను వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. చికిత్స మొదలుపెట్టేలోపు బాలుడు మృతి చెందాడు.

దళిత కుటుంబంపై టీడీపీ నేత దాడి



తీవ్రంగా గాయపడిన లావణ్య, గాయాలతో ఆస్పత్రి పాలైన వృద్ధురాలు, పిల్లలు

ఉరవకొండ: వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో ఓ దళిత కుటుంబంపై ఆ గ్రామ టీడీపీ నేత, మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి, ఆయన కుటుంబసభ్యులు దాడికి తెగబడ్డారు. బాధిత కుటుంబ యజమాని సురేష్‌బాబు తెలిపిన మేరకు... కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సురేష్‌బాబు కుమార్తెను కొంత కాలంగా అదే గ్రామానికి చెందిన యువకుడు తేజ వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. దీనిపై గతంలో వజ్రకరూరు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు. ఇటీవల సురేష్‌బాబు కుమార్తెను తేజ కలసి మైనారిటీ తిరగానే పెళ్లి చేసుకుంటానని, తనను ఎవరూ అడ్డుకోలేరంటూ అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళితే వారు తేజాను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు. అదే సమయంలో యువకుడి ఫోన్‌లో తనకు అడ్డంగా ఉన్న యువతి తండ్రి సురేష్‌బాబును హతమార్చేలా రూ.లక్ష సుపారీ ఇచ్చి ఒప్పందం చేసుకున్నట్లు ఉన్న ఆడియో బయటపడింది. ఈ ఆడియోను పోలీసులకు ఇవ్వడంతో యువకుడు మద్యం మత్తులో మాట్లాడి ఉంటాడని కొట్టి పడేశారు. అనంతరం రోజూ స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టి పోవాలని యువకుడికి పోలీసులు సూచించారు. ఈ వ్యవహారంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎర్రిస్వామి జోక్యం చేసుకుని యువకుడిపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా బయటకు తీసుకొచ్చారు. ఇది అన్యాయమంటూ సుధాకర్‌బాబు కుటుంబసభ్యులు ఎర్రిస్వామిని నిలదీస్తే దళితులై ఉండి తన ఇంటి వద్దకు ఎలా వస్తారంటూ దూషణలకు దిగడమే కాక మహిళలని కూడా చూడకుండా ఎర్రిస్వామి, ప్రకాష్, హనుమేష్‌తో పాటు మరో 10 మంది ఇష్టారాజ్యంగా దాడి చేశారు. అక్కడితో ఆగకుండా చర్చి వద్ద ఉన్న సురేష్‌బాబుపై ఎర్రిస్వామి ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఘటనలో సురేష్‌బాబుతో పాటు కుమార్తె, ఇతర కుటుంబసభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై వజ్రకరూరు ఎస్‌ఐ నాగస్వామి మాట్లాడుతూ.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆయుష్మాన్ సీహెచ్‌ఓల ధర్నా



చంటి పిల్లలతో కలసి ధర్నాలో పాల్గొన్న సీహెచ్‌ఓలు

అనంతపురం అర్బన్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ ఆయుష్మాన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎంసీపీ (ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సంఘం) జిల్లా అధ్యక్షుడు గణేష్‌కుమార్ మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం సీహెచ్‌ఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆరేళ్ల సర్వీసు దాటిని వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. ప్రతి నెలా వేతనంతో పాటు ఇన్సెంటివ్, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్ చెల్లించాలన్నారు. ఈపీఎఫ్ పునరుద్ధరించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి సీహెచ్‌ఓలను మినహాయించాలన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, బదిలీలు, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలువులు, తదతర వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకూ బాధ్యతతో కూడిన శాంతియుతమైన నిరసనలు కొనసాగిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను ఆయన చాంబర్ వద్ద నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి గౌరి, కార్యనిర్వాహక కార్యదర్శి షీబా ప్రియాంక, జిల్లా నాయకులు హరినాథ్‌రెడ్డి, సుధీర్, నాగరాజు, లక్ష్మీనారాయణ, సుబహాన్, హరి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్నారు

- ప్రభుత్వాల ప్రజావ్యతిరేక చర్యలను తిప్పికొట్టాలి
- బహిరంగసభలో వక్తల పిలుపు



మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు

అనంతపురం అర్బన్: గ్రామీణ పేదల వలసలు, ఆకలిచావులు నివారించేందుకు 100 రోజులు గ్యారెంటీ పనులు కల్పించే లక్ష్యంతో ఏర్పాటైన 'ఉపాధి' చట్టాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను సంఘటితంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కృష్ణకళామందిర్‌లో బహిరంగసభ నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు జెల్లి విల్సన్, ఏఐసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. బడ్జెట్‌లో రూ.4.60 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉంటే ఏటా తగ్గిస్తూ ఈ ఏడాది రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. కేంద్రానికి అనుకూలంగా రాష్ట్రప్రభుత్వం కూడా ఉపాధి చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మెటీరియల్ కాంపోనెట్‌ను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. పథకంలో నిధులను కూలీలకే కేటాయించాలన్నారు. కుటుంబ జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా ప్రతి వయోజనుడికి విడిగా జాబ్‌కార్డు ఇవ్వాలన్నారు. రోజు కూలీ రూ.700 ఇవ్వాలన్నారు. ప్రతి గ్రూప్‌కు పని కల్పించకపోతే ఏడాదికి ప్రతి కూలీకి రూ.12 వేలు చొప్పున ఉపాధి భృతి చెల్లించాలన్నారు. సభలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, కాంగ్రెస్ మైనారిటీ సెల్ రాష్ట్ర చైర్మన్ దాదా గాంధీ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, శ్రీసత్యసాయి జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానహబ్‌ను సోలార్ హబ్‌గా మారుస్తారా?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

గుంతకల్లు: ఉద్యాన హబ్‌గా పేరుగాంచిన ఉమ్మడి జిల్లాను సోలార్ హబ్‌గా మార్చేడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ మండిపడ్డారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మడకశిరలో పర్యటించిన విద్యుత్‌శాఖ మంత్రి ఉమ్మడి అనంత జిల్లాను సోలార్ హబ్‌గా మారుస్తామంటూ చేసిన ప్రకటనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంత జిల్లాతో పాటు రాయలసీమలో దాదాపు 30 రకాలకు పైగా పండ్లను పండిస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మాజీ ఎంపీ తలారి రంగయ్య అప్పట్లో ప్రభుత్వంతో చర్చించి పంట ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ప్రత్యేక కిసాన్ రైళ్లను నడపారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు సైతం ఇక్కడి ఉద్యాన తోటల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు వీలుగా కార్గో ఎయిర్‌పోర్టు సేవలను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారన్నారు. అయితే ప్రస్తుతం మంత్రి వ్యాఖ్యలను బట్టి చూస్తే ఉద్యాన హబ్‌ను కాస్త సోలార్ హబ్‌గానే మార్చే క్రమంలోనే హంద్రీ-నీవా కాలువ డిస్ట్రిబ్యూటర్లు ఏర్పాటు చేయలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కేవలం హంద్రీ-నీవా నీటిని కుప్పంకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఇక్కడి ఉద్యాన తోటలకు సమాధి కట్టేందుకు కూటమి సర్కార్ సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.గోవిందు, ఎం.వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, రాము రాయల్, ఎస్ఎండీ గౌస్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రాల ఏర్పాటు



ఉద్యానశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

అనంతపురం అగ్రికల్చర్: వేసవితీవ్రతను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో ఏపీఎంఐపీ సంయుక్తంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. పనులు మీద కార్యాలయానికి వచ్చే రైతులు ఇబ్బంది పడకుండా తాగునీటి సదుపాయం కల్పించినట్లు ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ డీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. అలాగే స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం పర్సన్ ఇన్‌చార్జ్ హోదాలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ ప్రారంభించారు. బ్యాంకు వచ్చే రైతులు, ఖాతాదారుల సదుపాయం కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సీఈఓ కే.సురేఖా రాణి తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేద్దాం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 40 కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేద్దామని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని బహుళ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ప్రజల సౌకర్యార్థం మరిన్ని ఏర్పాటు చేద్దామన్నారు. ఇందుకు వ్యాపారులు సముఖత వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ షాకీర్ పాల్గొన్నారు.

26న అక్కల్‌కోట్ మహారాజ్ ఆరాధన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆశ్రమ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని సద్గురు వలీస్వామి ఆశ్రమంలో ఈనెల 26న అవధూత స్వరూపులు అక్కల్‌మహారాజ్ ఆరాధన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ప్రతినిధి విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆశ్రమంలో అక్కల్‌కోట్ మహారాజ్ 147వ ఆరాధన ఉత్సవాల పోస్టర్‌ను ఆశ్రమ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం కొల్హాపూరి మహాలక్ష్మి అమ్మవారు, అక్కల్‌కోట్ మహారాజ్‌కు విశేష అభికాలు అర్చనలు, హోమాలు వేదపండితులు సుంకేశుల సత్యనారాయణ నిర్వహిస్తారన్నారు. అనంతరం డాక్టర్ పాణ్యం వసుంధర స్వామివారి దివ్యచరితామృతాన్ని ఆధ్యాత్మిక ఉపన్యాసంలో వివరిస్తారని తెలిపారు. సాయంత్రం పెద్ద ఎత్తున నగరోత్సవం ఉంటుందని వివరించారు.

పాఠశాలలో చేర్పించండి



ఆత్మకూరులో ఉపాధ్యాయుల ప్రచారం

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలున్నాయని వాటిలో పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంచి విద్యను అందించడంతోపాటు క్రీడలు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందితే చర్యలు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ హేమలత

రాప్తాడు: నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన అంగన్‌వాడీ సిబ్బందిపై చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, నాగరత్న హెచ్చరించారు. మంగళవారం రాప్తాడు అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్–1 పరిధిలో సూపర్‌వైజర్ నాగరత్న, చిన్మయనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్–2 పరిధిలోని ఆయాల సర్టిఫికెట్లను సూపర్‌వైజర్ హేమలత పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టులో నకిలీ సర్టిఫికెట్లతో కొంత మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఈనేపథ్యంలో ఐసీడీఎస్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

పుస్తకం.. మంచి నేస్తం!

- హాస్య రచనలకు పెరుగుతున్న ఆదరణ
- వేసవిని పుస్తకంతో గడపాలని సూచిస్తున్న రచయితలు

సందర్భం

నేడు అంతర్జాతీయ పుస్తక దినోత్సవం


అనంతపురం కల్చరల్: పుస్తక పఠనం ఓ మంచి అనుభూతి. ఓ మథనం... ఓ చైతన్యం.. వెరసి మనుషుల అనుభవాల సారం. ప్రతి పుస్తకంలో ఓ జీవితం దాగుంటుంది. కందుకూరి వీరేశలింగం అన్నట్టు ''పుస్తకం నీకు దారి చూపించే ఉపాధ్యాయుడు....నిన్ను సాహితీ గగన తలంలో విహరింపజేసే సాధనం' అటువంటి మానసిక వికాసానికి దోహదపడే పుస్తకానికి చరిత్ర పుటల్లో అందమైన స్థానాన్ని కల్పించారు. ప్రఖ్యాత రచయిత విలియమ్ షేక్స్ ఫియర్ జన్మదినమైన ఏప్రిల్ 23న 'అంతర్జాతీయ పుస్తక దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. మంచి పుస్తకాల పట్ల ఆదరణ పెంచేలా అవగాహన కల్పించడం... ఉన్న పుస్తకాల పట్ల కొన్న ప్రేమతో భద్రపరచడం వంటివి చేయాలన్నది ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. 'ప్రతి మంచి పుస్తకం విలువైన నేస్తం' అన్నది ఈతరం వారు అంగీకరించాల్సిన సత్యం. సాంకేతిక విజ్ఞానం ఎంత వేగంగా దూసుకెళ్తున్నా నేటికీ పుస్తకం భేషుగ్గా తనదైన పాత్రను పోషిస్తూనే ఉంది. పుస్తకానికి ఆదరణ తగ్గలేదని చాటే కార్యక్రమాలు బుధవారం పలు చోట్ల జరుగుతున్నాయి.

నవలలకు తగ్గని ఆదరణ

కాల్పనిక సాహిత్యం, ప్రబంధ సాహిత్యం, విప్లవ సాహిత్యం, ఆధునిక సాహిత్యం... ఇలా ఒక్కొక్కటి ఒకో కాలంలో మనిషి అభివృద్ధికి మారుతున్న భావజాలాలకు అండగా నిలిచాయి. ఒకప్పుడు రాజ్యమేలిన నవలలు మళ్లీ ఇప్పుడు ఊపందుకుంటున్నాయి. అలాగే ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాస పుస్తకాలకూ తరగని ఆదరణ ఉంటోంది. ముఖ్యంగా యువ రచయితలు పెరుగుతుండడంతో వస్తున్న పెనుమార్పులు పుస్తకాదరణకు ఇతోధికంగా దోహదపడుతోంది. జిల్లా సాహితీ ప్రచారంలో విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి, స్ఫూర్తి పుస్తకశాలల వారిది ప్రత్యేక స్థానం. మరీ ప్రధానంగా ఆదివారం నాడు నగర వీధుల్లో జరిగే పుస్తకాల సంతలో అధికంగా పుస్తకాలను కొనేవారు బారులు తీరి ఉంటుండడం పుస్తకాదరణ తగ్గడం లేదని చెప్పడానికి చిన్న ఉదాహరణ శ్రీశ్రీ 'మహాప్రస్థానం' అమ్మకాలు. అలాగే జిల్లా వాసుల అర్ధనారి, సప్తభూమి, సీమ కథాసాహిత్యం పుస్తకాలతో పాటూ పున్నాగ పుష్పాలు, కాలాతీత వ్యక్తులు, బుచ్చిబాబు చివరకు మిగిలేదేది, అసమర్థుని జీవిత యాత్ర, వంటి పుస్తకాలు పాఠకుల వద్దకు విరివిగా చేరుతున్నాయని పుస్తక విక్రేతలంటున్నారు. పోటీ పరీక్షలకైతేనేమి... పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పేరుతోనైతేనేమి పుస్తక పఠనం బాగా పెరిగినట్టు అక్కడి నిర్వాహకులు చెబుతున్నారు. సీరియస్ కథలకన్నా వ్యంగ్యం, హాస్యం, ఎత్తిపొడుపుల సమ్మేళనంతో సాగే వాటిని పాఠకులు బాగా ఆదరిస్తున్నారని అంటున్నారు. కాకపోతే ఎంత ఖరీదైన పుస్తకమైనా ఉచితంగా ఇస్తే తప్ప కొని చదివే అలవాటు క్రమంగా తగ్గిపోతోందని రచయితలు వాపోతున్నారు. త్వరలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రానున్న దృష్ట్యా మండే ఎండలను దృష్టిలో పెట్టుకుని చిన్నారులను ఇంటి పట్టునే పుస్తక పఠనం వైపు మళ్లించాలని మేధావులంటున్నారు.



పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి



ఒత్తిడి నిండిపోతున్న ప్రస్తుత రోజుల్లో పుస్తకం ఆహ్లాదకర వాతావరణాన్ని, వీలైతే వ్యంగ్యాన్ని, హాస్యాన్ని సృష్టించేలా ఉండాలని అదే తరహా కథలు రాస్తున్నాను. పుస్తక రూపంతో పాటూ వాట్సప్ ద్వారా 'నవ్వుకుందాం' అనే శీర్షికతో రోజుకొక హాస్యకథతో మేము చేస్తున్న ప్రయోగానికి విశేష స్పందన వస్తోంది. చాలా మంది రచయితలు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వస్తున్నారు. అరచేతిలోనే ఇష్టమైన సెల్‌ఫోన్ ద్వారా కవితను, కథను, వ్యాసాన్ని చదవగలిగే సాంకేతిక నైపుణ్యం వచ్చేయడంతో ఎక్కడి పుస్తకాలైనా చదవగలుగుతున్నాము. పుస్తకాన్ని కొని చదివే వాళ్ల సంఖ్య తగ్గిపోవడం బాధాకరం. పిల్లల్లో పుస్తక పఠనాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

– తరిమెల అమరనాథరెడ్డి, కవి, హాస్య కథకుడు

భావితరాలకు బంగారు భూమి అందిద్దాం

అనంతపురం అగ్రికల్చర్: భావితరాలకు బంగారు భూమి అందించే బాధ్యత సమాజంలో అందరిపై ఉందని వ్యవసాయశాఖ అనంతపురం ఏడీఏ ఎం.రవి తెలిపారు. ప్రపంచ భూమి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రూరల్ మండలం కక్కలపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విచ్చలవిడి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో పాటు ప్లాస్టిక్ భూతం వల్ల భౌగోళికంగా మార్పులు వస్తున్నాయన్నారు. అడవులు అంతరిస్తుండటం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. దీని వల్ల జీవ వైవిధ్యం, ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోందని తెలిపారు. అలాగే రైతులకు వ్యవసాయం భారమవుతోందన్నారు. ప్రకృతిని పరిరక్షించడం, భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, లేదంటే భావితరాల మనుగడ ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే 1970 నుంచి ప్రపంచ వ్యాప్తంగా భూమి దినోత్సవం నిర్వహిస్తూ విద్యార్థి దశ నుంచే అవగాహన, రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు జే.శశికళ, పి.సోమశేఖర్, ప్రాసెసింగ్ ప్లాంట్, టమాట మండీ నిర్వాహకులు రమణ, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ ఎం.రవి

దళితులంటే అంత చులకనా..?

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు

అనంతపురం కార్పొరేషన్: సీఎంగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడల్లా దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతాయని, దళితులంటే అంత చులకనా?అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు ధ్వజమెత్తారు. పీతాపురం మల్లం గ్రామంలో దళితులను సాంఘిక బహిష్కరణ చేయడాన్ని ఆయన తప్పుబడుతూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దళితులను బహిష్కరణ చేయడం సనాతన ధర్మంలో భాగమా పవన్ కళ్యాణ్ అని ప్రశ్నించారు. హోంమంత్రి అనిత చేతగానితనంతో దళితులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి వర్గంలో ఉన్న దళిత నాయకులు సైతం నోరు మెదపకపోవడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగానికి ఇది ఓ నిదర్శనమని, రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం రూరల్: పోషక విలువలు కలిగి ఉన్న ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అన్నారు. మంగళవారం రాజీవ్‌కాలనీ పంచాయతీలోని రిక్షా కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పౌష్టికాహార ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సర్పంచ్ ఆశాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు షాహిన్‌తాజ్, హేమావతి, వరలక్ష్మి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నేడు సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: ఆనాటి ఆనంద హృదయాల ఆనంద గీతాల పేరుతో బుధవారం సాయంత్రం స్థానిక ఆఫీసర్స్‌క్లబ్ ప్రాంగణంలో సినీస్వర చక్రవర్తి, గానకోకిల ఎస్.జానకి జన్మదినం సందర్భంగా గురువులకు గళ నివాళి అర్పిస్తున్నట్లు నిర్వాహకుడు బాలమురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం క్లబ్, అనంత ఉపాధ్యాయ కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సినీ సంగీత విభావరిలో సీనియర్ గాయనీ గాయకులు, విద్యావేత్తలు, అధికారులు అలనాటి మధుర గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. కళాభిమానులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

• మోడువారితేనేం..



అనంతపురం సర్వజనాస్పత్రిలో ఓ చెట్టు ఎండిపోయి మోడుగా మారింది. కానీ ప్రకృతి ప్రేమికుడైన నూర్ దానిని ఆకర్షణీయంగా మార్చేశాడు. మోడు వారిన చెట్టుకు రంగులు పూయడంతోపాటు వాటి కొమ్మలపై పూలకుండీలు అమర్చడంతో ఆకర్షణీయంగా మారింది. అటుగా వెళ్లేవారంతా ఆ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

సురక్షిత ప్రమాణాలు పాటించకపోతే ఎలా?

- ఆస్పత్రి ఏడీ మల్లికార్జున రెడ్డి
- డైట్ నిర్వహణపై కలెక్టర్ ఆరా

అనంతపురం మెడికల్: డైట్ తయారీలో సురక్షిత ప్రమాణాలు పాటించకపోతే ఎలాగని డైట్ కాంట్రాక్టర్‌పై ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్(ఏడీ) మల్లికార్జున రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం సాక్షిలో 'వామ్మో..ఇదేం డైట్..!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆరా తీశారు. డైట్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్‌ని ఆదేశించారు. దీంతో ఆస్పత్రి ఏడీ, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాసులు నాయుడు డైట్‌ను పరిశీలించారు. సాక్షిలో వచ్చిన కథనంలో వాస్తవం ఉందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. అక్కడ కళ్లకు కట్టినట్లు డైట్ నిర్వహణ లోపాలు కన్పించాయి. వంట, కూరగాయలు తరిగేది, శుభ్రం చేసే ప్రాంతం అన్నీ ఒకే చోట ఉంచితే ఎలాగని డైట్ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు చూసుకోవాల్సిన బాధ్యత మీకు లేదానని డైటీషియన్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. కనీసం ఎగ్జాస్టడ్ ఫ్యాన్లు కూడా లేకపోతే ఎలాగని నిలదీశారు. డైట్‌లో ఉన్న చెత్త చెదారం, గుజరీని తరలించేలా చూడాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈని అడ్మినిస్ట్రేటర్ ఆదేశించారు. కంటామినేషన్ పరికరాలను త్వరలో వేలం వేసి అక్కడి నుంచి తరలించేలా చూస్తామని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ తెలిపారు.

గ్రీనరీ పనులు నాణ్యతతో చేపట్టండి

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: అంబేడ్కర్ ఫ్లైఓవర్ వద్ద గ్రీనరీ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయించాలని కమిషనర్ బాలస్వామిని మేయర్ వసీం ఆదేశించారు. మంగళవారం కమిషనర్‌తో కలసి మేయర్ 37వ డివిజన్‌లో పర్యటించారు. ఎన్ క్యాప్ నిధులు రూ.34 లక్షలతో చేపడుతున్న గ్రీనరీ పనుల మ్యాప్‌ను మేయర్, కమిషనర్ పరిశీలించారు. డివిజన్‌లో ప్యాచ్ వర్కులు మొదలు పెట్టాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టులు, రోడ్లు మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. రాంనగర్ పార్కులో చాలా మంది వాకింగ్ చేస్తుంటారని, పార్కు నిర్వహణ పక్కగా చేపట్టాలన్నారు. మేయర్ వెంట ఈఈ షాకీర్, బీఎల్ నరసింహులు, డీఈ సుభాష్, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, ఏఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీనరీ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం, కమిషనర్ బాలస్వామి

ఎస్కేయూలో వర్మీకల్చర్ యూనిట్ ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత, ప్రిన్సిపాల్ ఏ.కృష్ణకుమారి

అనంతపురం: ఎస్కేయూ బొటానికల్ గార్డెన్‌లో వర్మీకల్చర్ (వానపాముల పెంపకం) యూనిట్‌ను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత మంగళవారం ప్రారంభించారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వ పర్యావరణ శాఖ నిధులు అందజేసిన ఈ ప్రాజెక్టును ప్రొఫెసర్ బి. రవిప్రసాద్‌రావు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీకి సత్కారం



జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావును సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావును వర్సిటీ బోధన సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ సుదర్శనరావు జేఎన్‌టీయూ అనంతపురం పూర్తి స్థాయి బాధ్యతలతో కూడిన వీసీగా నియమితులైన సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. బోధన, పరిశోధనల్లో అపారమైన అనుభవం, గతంలో వర్సిటీలో కీలక పదవుల్లో పనిచేసి వర్సిటీ పురోగతికి సుదర్శనరావు దోహదపడ్డారని ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి కొనియాడారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ. దేవన్న, జేఎన్‌టీయూ టీచింగ్ స్టాఫ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టి. నారాయణ రెడ్డి, సెక్రెటరీ డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు లేని బడి.. చదువుల ఒడి'

రాప్తాడురూరల్: 'పైసా ఫీజు చెల్లించని బడి...ప్రభుత్వ బడి' అంటూ కందుకూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల టీచర్లు వినూత్న ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం ఈనెల 21 నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు 'స్టూడెంట్స్ ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కందుకూరు ప్రాథమిక పాఠశాల టీచర్లు వి. ఇందుమతి, మంచి ఓబన్న, టి. శాంతికిరణ్ బైకుకు 'ప్రభుత్వ బడి ముద్దు.. వేరే బడి వద్దు', 'ఫీజు లేని బడి–చదువుల ఒడి' అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకుని కందుకూరుతో పాటు జంగాపల్లి, ఎస్కేయూ రోడ్డులో ప్రచారం చేపట్టారు.



ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు సిద్ధమైన కందుకూరు ప్రాథమిక పాఠశాల టీచర్లు

పంపనూరులో నీటి సమస్య పరిష్కారం



కొత్తగా వేసిన బోరుకు మోటరు బిగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: పంపనూరులో నీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో నీటి సమస్య తలెత్తడంతో సోమవారం సాక్షిలో 'తాగునీటి సమస్య తీరేదెన్నడు?' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పంపనూరు, పంపనూరు తండా గ్రామాల్లో రెండు రోజుల పాటు పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ పంపనూరులో 7.5 హెచ్‌పీ మోటరు, అంగన్‌వాడీ కేంద్రం వద్ద పైప్‌లైన్, 3 చేతి పంపులు మరమ్మతు చేయించామన్నారు. అలాగే పంపనూరు తండాలో పంచాయతీ బోరు, మోటరు, రెండు చేతిపంపులు, పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు చేయించామని వివరించారు. పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఈవోఆర్డీ కామాక్షి, పంచాయతీ సెక్రటరీ శిరీష పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలసిన మహాలక్ష్మి



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మహాలక్ష్మి శ్రీనివాస్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్ కలిశారు. మంగళవారం తాడేపల్లిలో పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జగనన్నకు మహాలక్ష్మి పుష్పగుచ్ఛం అందించారు. పొలిటికల్ అడ్వైజరీ కమిటీలో అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

సనపలో రక్తనమూనాల సేకరణ



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: సనప గ్రామంలో వైద్య సిబ్బంది సోమవారం రాత్రి వరకు బోదకాలు వ్యాధికి సంబంధించి రక్త నమూనాలను సేకరించినట్లు డాక్టర్ సబిహా సుల్తానా మంగళవారం తెలియజేశారు. గ్రామంలో మొత్తం 306 మంది రక్త నమూనాలను సేకరించామని, ఎవరికైనా బోదకాలు వ్యాధి లక్షణాలు ఉంటే చికిత్స, జాగ్రత్తలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఏఎంఓ సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారులు మద్దయ్య, శ్రీధర్‌మూర్తి, మహమ్మద్ నూర్‌బాషా, పీహెచ్ఎన్ తులసమ్మ, ఏఎన్ఎం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా లైనింగ్ పనులు ఆపాలి



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ చేస్తుండడం వలన భూగర్భజలాలు అడుగంటిపోతాయని, వెంటనే పనులు అఖిల భారత రైతు, వ్యవసాయ కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు హంద్రీ–నీవా సీఈ నాగరాజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగముత్యాలు మాట్లాడుతూ.. ఆత్మకూరు మండలం పంపనూరు, పంపనూరు తండా, వై.కొత్తపల్లి గ్రామాల్లో ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటి పోవడంతో పంటలకు అపార నష్టం వాటిల్లుతోందన్నారు. హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ చేస్తే భవిష్యత్‌లో బోర్లలో చుక్కనీరు వచ్చే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే లైనింగ్ ఆపాలని కోరారు. నాయకులు రమేష్, వేణు, ఓబుళపతి, బాలరాజు, అంజి, రామచంద్ర పాల్గొన్నారు.